కోలుకుంటున్న వరిపైరు

- తగ్గుముఖం పట్టిన వర్షాలు
- పొలాల నుంచి బయటకు వెళ్తున్న నీరు
- సస్యరక్షణ చర్యలు చేపడుతున్న రైతులు



ముంపునుంచి బయటపడిన పైరు, ఎర్రకాల్వ పొంగి గణపవరం మండలంలో ముంపునకు గురైన పొలాలు

గణపవరం: ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన వరిపైరు క్రమంగా తేరుకుంటుంది. గత వారం రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పొలాల్లో ముంపునీరు పూర్తిగా బయటకు పోయింది. పంట, మురుగు కాల్వలలో నీటి ఉధృతి తగ్గడంతో పొలాల్లోని నీరు బయటకు పోయింది. అయితే చాలా గ్రామాల్లో రోజుల తరబడి నీటిలో నానిన వరిపైరు దాదాపు కుళ్లి పనికిరాకుండా పోయింది. వారం రోజులలోపు ముంపు నుంచి బయటపడిన పైరు క్రమంగా కోలుకుంటుంది. ముంపు నుంచి బయట పడ్డాక తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో పైరు మూన తిరిగి క్రమంగా కోలుకుంటుంది. వారానికి పైగా ముంపులో ఉండటంవల్ల పూర్తిగా పాడయిన వరి చేలల్లో రైతులు రెండోసారి నాట్లు వేస్తున్నారు. కొందరు రైతులు అక్కడక్కడ పాడైన చోట్ల వరినాట్లు వేయగా మరి కొందరు రైతులు పూర్తిగా కొత్తనాట్లు వేసుకుంటున్నారు. గణపవరం నిడమర్రు మండలాల పరిధిలో 15 వేల ఎకరాల విస్తీర్ణంలో సార్వా సాగు చేస్తుండగా గతనెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల సమయానికి సుమారు 7 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. భారీ వర్షాలకు, ఎర్రకాల్వకు వచ్చిన వరదలకు సుమారు 90 శాతం మేర అంటే 6 వేల ఎకరాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయి. దీనిలో సుమారు 3 వేల ఎకరాల్లో వరిపైరు ముంపునుంచి తేరుకోగా మరో మూడు వేల ఎకరాల్లో వరినాట్లు పనికి రాకుండా పోయాయి. అలాగే 500 ఎకరాలలో నారుమడులు ముంపునకు గురికాగా సుమారు 200 ఎకరాలలో నారుకూడా పనికిరాకుండా పోయింది. వర్షాలు తగ్గి, వరదనీరు బయటకు పోవడంతో బతికి ఉన్న పైరుకు సస్యరక్షణ, కుళ్లి పోయిన పొలాల్లో మళ్లీ వరి నాట్లు వేయడం వంటి పనుల్లో రైతులు తలమునకలై ఉన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నారుతోపాటు, ఇతర ప్రాంతాల నుంచి కూడా రైతులు నారుతెచ్చుకుని నాట్లు వేసుకుంటున్నారు.

గణపవరం మండలంలో...

గణపవరం మండలంలో ఎర్రకాల్వకు వరదలు రావడంతో డి.కుముదవల్లి, కోమర్రు, మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, వెంకట్రాజపురం, కొందేపాడు, పిప్పర గ్రామాలలో సుమారు నాలుగు వేల ఎకరాలలో ఎర్రకాల్వ వరదనీరు ప్రవేశించి వరినాట్లు పూర్తిగా కుళ్లి పోయాయి. సుమారు 200 ఎకరాలలో ఇంకా ముంపునీరు తగ్గలేదు. ముంపు నీరు తొలగిపోయిన పొలాల్లో రైతులు మరోసారి వరినాట్లు వేసుకుంటున్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాలతోపాటు, ప్రక్కజిల్లాలకు వెళ్లి నారు తెచ్చుకుని నాట్లు వేస్తున్నారు. వరదనుంచి తేరుకుని బ్రతికిన వరిపైరుకు తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే వరి త్వరగా తేరుకుని పిలకలు తొడుగుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మండలంలో ముంపు బారిన పడిన పొలాల్లో 50 శాతం పొలాలు ముంపునుంచి బయటపడ్డాయి. మిగిలిన పొలాల్లో నెమ్మదిగా నీరు లాగుతుంది. ముంపు నుంచి బయటపడిన పొలాల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా చల్లుకోవాలి. పైరు పూర్తిగా కోలుకున్న తర్వాత తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉంది. తెగుళ్ల సోకకుండా కార్బన్‌డిజం రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

– యర్రంశెట్టి ప్రసాద్, ఏవో, గణపవరం

కాలువలో గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు

పెదపాడు: కేఈ కెనాల్‌లో బర్ధనాచు, గుర్రపుడెక్క పెరిగిపోవడంతో నీటి ప్రవాహం తగ్గి ఇబ్బందులు పడుతున్నారని రైతులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు కెనాల్‌లో బర్ధనాచు, గుర్రపుడెక్క తొలగింపు చర్యలు చేపట్టారు. రెండు రోజులుగా ట్రాక్టర్లతో గుర్రపుడెక్క, బర్ధనాచు తొలగిస్తున్నారు. స్థానిక నాయకులు ఈ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాయకులు గుత్తా అనీల్, పెద్దిరెడ్డి రమేష్, వ్యవసాయ సహాయకుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు దడ పుట్టిస్తున్న వర్షం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. సుమారు రెండు దుక్కులు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై రోజంతా కురుస్తున్న వర్షంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. జూలై నెలలో ఏకధాటిగా 20 రోజులు కురిసిన వర్షానికి రైతులు ఆందోళన చెందిన విషయం తెలిసిందే. మూడింట ఒక వంతు పంటపొలాలు మునిగిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముంపునుంచి తేరుకోక ముందే తిరిగి మళ్లీ వర్షం మొదలవడంతో గోరుచుట్టుపై రోకలిపోటు అన్న చందంగా పరిస్థితి తయారైంది. రైతులు ఈఏడాది పంట విరామం ప్రకటించాల్సి వస్తుందేమోనని భయపడుతున్నారు. కాకర్లమూడి, దొంతవరం, రావులపర్రులో కొంతబాగం, బాదంపూడి, వెల్లిమిల్లి, రామన్నగూడెం వెంకటకృష్ణాపురం ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఏర్పడింది.

క్లుప్తంగా

విద్యతోనే బంగారు భవిష్యత్తు



గుండుగొలనులో విద్యార్థులకు స్కూలు బ్యాగ్‌లను అందిస్తున్న దృశ్యం

భీమడోలు: విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గుండుగొలనులోని శ్రీభోగరాజు పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాళీబాబు అన్నారు. గుండుగొలను నెం.1 ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎరువుల కంపెనీ ప్రతినిధులు తమ ఆర్థిక సాయంతో చిన్నారులకు స్కూల్ బ్యాగ్స్, నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం పాశం పాండురంగారావు అధ్యక్షత వహించారు. విద్యార్థులకు అభ్యసనా సామగ్రిని ఉచితంగా అందించడం పట్ల కంపెనీ ప్రతినిధులను అభినందించారు.

చేనేత కార్మికులకు సత్కారం



ఉంగుటూరులో చేనేత కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అడపా శోభారాణి ఆధ్వర్యంలో చేనేత దినోత్సవాన్ని ఉంగుటూరులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను సత్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శరణాల మాలతీరాణి, ఇందుకూరి చక్రవర్తివర్మ, మండల అధ్యక్షులు దుర్గారావు, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు: పెదపాడు సెక్షన్ పరిధిలో 33 కేవీ పెదపాడు ఫీడర్ నుంచి పాతముప్పర్రు, పెదపాడు వెళ్లు 33కేవీ లైన్ల మరమ్మతులు, సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా గురువారం మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. పాతముప్పర్రు సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తూరు, కొత్తముప్పర్రు, పాతముప్పర్రు, జయపురం, వీరమ్మకుంట, వెంకటాపురం, పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలోగల పెదపాడు, నాయుడుగూడెం, రాజుపేట, సత్యన్నారాయణపురం, సత్యవోలు, గుడిపాడు, కొణికి, రాళ్లపల్లివారి పాలెం, ఖాజీగూడెం, గోగుంట, తోటగూడెం, వసంతవాడ, పునుకొల్లు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు.

ఉంగుటూరు: గొల్లగూడెం, నల్లమాడు విద్యుత్ సబ్ స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వేణు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

దెందులూరు పోస్టుమాస్టర్‌గా వెంకటేశ్వరరావు

దెందులూరు: దెందులూరు పోస్టుమాస్టర్‌గా పీ వెంకటేశ్వరరావు బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యలు స్వీకరించారు. సిబ్బంది ప్రజల సహాయ సహాకారాలతో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, డిపాజిట్ల పెంపునకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

చర్చి శ్లాబ్ నిర్మాణం

దెందులూరు: దెందులూరు గౌడవీధిలోని సాల్వేషన్ ఆర్మీ చర్చికి బుధవారం శ్లాబ్ నిర్మాణం జరిగింది. సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ కే. రమణయ్య ఆధ్వర్యంలో సంఘ పెద్దలు, సంఘస్తులు, సండే స్కూల్ చిన్నారులు, యువత శ్లాబ్‌నిర్మాణంలో సహకారాన్ని అందించారు. తొలుత శ్లాబ్ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేందుకు కోర్ ఆఫీసర్ దంపతులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆరోగ్యశ్రీ పథకం పేదల పాలిట వరం



భీమడోలు సీహెచ్‌సీలో రోగులకు పండ్లు అందిస్తున్న వైద్యురాలు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు

భీమడోలు: ఆరోగ్యశ్రీ పథకం పేదల పాలిట వరమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ మాదిగ అన్నారు. ఆరోగ్యశ్రీ సాధికారత ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివంగత సీఎం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారని, అయితే ఆ పథకం కోసం ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విశేషంగా కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వారంతా క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆసుపత్రులోని రోగులకు పండ్లను అందించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, నాయకులు ఎం.ఎలియా మాదిగ, కొత్తపల్లి చంద్రమౌళి, కాటూరి జోగేశ్వరరావు, ఉండి నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్, శాస్త్రి, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు నైపుణ్య శిక్షణ



మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీవో శివరామకృష్ణ

గణపవరం: ప్రధానమంత్రి మత్స్య సంపదలో భాగంగా మత్స్య సహకార సంఘాలలో సభ్యులుగా ఉన్న మత్స్యకారులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు గణపవరం ఎఫ్‌డీవో శివరామకృష్ణ చెప్పారు. బుధవారం గణపవరం మండలం చిలకంపాడులో శ్రీరామ నెయిలీకుల మత్స్యకార సహకారసంఘం, పెంటపాడులోని కాశీఅన్నపూర్ణ మత్స్యకార సంఘాల సభ్యులకు రైతు ఉత్పత్తి దారుల సమాఖ్యలుగా అభివృద్ధి చేయుటకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో మాట్లాడుతూ మత్స్య సహకార సంఘాల సభ్యులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ప్రధానమంత్రి మత్స్య సంపదద్వారా ఆర్థిక సహాయం అందించి వారిని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వివిధ దశల్లో వివిధ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి, నైపుణ్యత పెంచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, మత్స్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకర్‌బాబు

దెందులూరు: పోస్టాఫీస్ సేవలను గ్రామాల్లోని ప్రజలు వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసర్స్ శ్రీకర్‌బాబు కోరారు. బుధవారం దెందులూరు పోస్టాఫీసులో ఎస్‌పీఎం పీ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన డాక్ చౌపల్ అవగాహన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకర్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీసుల ద్వారా అందిస్తున్న అన్ని పథకాలను గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ శ్రీలత, దెందులూరు బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, దెందులూరు, కొవ్వలి, గోపన్నపాలెం, శ్రీరామవరం, గుండుగొలను పోస్ట్‌మాస్టర్లు, పోస్ట్‌మ్యాన్‌లు, సబ్ స్టాఫ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా సుమతి బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

దెందులూరు: మండలంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తానని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. బుధవారం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలతో సమీక్షించారు. గ్రామాలవారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో అంకితభావంతో కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

దెందులూరు తహసీల్దార్‌గ బి.సుమతి బుధవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందించారు.

కేన్సర్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాలి



కేన్సర్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం: అవగాహన రాహిత్యంతో కేన్సర్ వ్యాధి బారిన పడి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, కేన్సర్ వ్యాధిపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మండల పీఎంపీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తుందని, అన్ని గ్రామాలలో ప్రజలకు కేన్సర్ పరీక్షలను ఉచితంగా చేస్తారని తెలిపారు. దీనిపై గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు సుధీర్‌వర్మ, రాష్ట్ర పీహెచ్‌పీ ప్రధాన కరార్యదర్శి బీటీ రాజు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు కేన్సర్ కారకాలని, వీటివల్ల ఊపిరితిత్తుల కేన్సర్ వస్తుందన్నారు. అలాగే శీతల పానీయాలు పేగు కేన్సర్, ఆల్కహాల్ లివర్ కేన్సర్‌కు కారణమవుతన్నాయన్నారు. రాష్ట్ర పీఎంపీ అసోసియేషన్ గౌరవ సలహాదారు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నిడమర్తి జయసూర్య మాట్లాడుతూ గర్భాశయ కేన్సర్, ముఖ కేన్సర్‌ల నియంత్రణకు ఆడపిల్లలకు 11 ఏళ్లు రాగానే వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. సభలో జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, సరిపల్లె సర్పంచ్ చనుమూరి దుర్గాభవాని, నిడమర్రు మండల పీఎంపీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, విద్యావేత్త నాగేశ్వరరావు, సంకు శ్రీనివాసరావు, ప్రభాకరావు, మస్తాన్‌వలి, గణేష్, ప్రభాకరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గణపవరంలో కేన్సర్ అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

నేడు పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు

- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు



భీమడోలు ఉన్నత పాఠశాలలో ఎన్నికల నియమావళిని పరిశీలిస్తున్న ఎంఈవో 2 భాస్కర్‌కుమార్

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వ హయాంలోని పేరెంట్స్ టీచర్స్ కమిటీలను ఈ ప్రభుత్వం ఎస్‌ఎంసీగా మార్పు చేసింది. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 206 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల పరిశీలకులు వీరే

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. మండల తహసీల్దార్, ఎంపీడీవో, వీఆర్వోలు ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లిదండ్రులు, పిల్లల సంరక్షకులుగా ఉన్న వారు ఓటర్లుగా తమ ఓటును వినియోగించుకుంటారు.

పాఠశాలలు.. రాజకీయ వేదికలు

కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. వారికి చెందిన వ్యక్తులను చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నుకునేందుకు పావులు కదుపుతున్నారు. క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు కూటమి నేతలు ఈ ఎన్నికలపై ప్రధానంగా దృష్టి సారించారు. రాజకీయాలకుతీతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగి అభివృద్ధికి నాంది పలికేవారిని కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎస్‌ఎంసీలకు ఊపిరి పోసిన జగనన్న ప్రభుత్వం

స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీలకు గత ప్రభుత్వం ఊపిరి పోసింది. అంతకుముందు పేరుకే ఈ కమిటీలను ఎన్నుకుని పెత్తనమంతా అధికార పార్టీ నేతలే చలాయించే వారు. ఎస్‌ఎంసీ కమిటీ సభ్యుల పాత్ర నామమాత్రంగా ఉండడంతో అభివృద్ధికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కమిటీలకు పాఠశాల నిర్వహణలో అభివృద్ధిలో కీలకపాత్ర పోషించేలా చర్యలు చేపట్టి సఫలీకృతం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నాడు నేడు నిధులను ఈ కమిటీలకే అప్పగించారు. రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చేయడంతో పాఠశాలలు అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా పయనించాయి.

ఎన్నికల నిర్వహణ ఇలా

ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణ విధి విధానాలను విద్యాశాఖాధికారులు వెల్లడించారు. పాఠశాలలోని సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతిని యూనిట్‌గా తీసుకుని ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వారిలో ఇద్దరు మహిళలు ఉండాలి. ముగ్గురిలో ఒకరు ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, బీసీ, ఈబీసీ, మైనార్టీలకు చెందిన వారే ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 శాతం ఓటర్ల హాజరును రిజిస్టర్‌లో చూపిన తర్వాత ఎన్నికలు జరపాలి. అదే విధంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు 50 శాతం సభ్యులుండాలి. తరగతుల వారీగా ఎన్నికైన సభ్యులంతా ఎస్‌ఎంసీ సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ సభ్యులంతా చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. ఒక వేళ తరగతిలో కనీసం ఆరుగురు విద్యార్థులు లేకుంటే మరో తరగతిలో విలీనం చేసి ఎన్నుకోవాలి.

పెదపాడు: పెదపాడు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులచే ఈ కమిటీలు ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కమిటీ సభ్యుల ఎన్నిక, కమిటీ సభ్యుల జాబితా ప్రకటన చేయడం జరుగుతుందని, మధ్యాహ్నం 1.30గంటలకు అధ్యక్ష ఉపాధ్యక్షుల ఎన్నిక, 2 గంటలకు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం, అనంతరం మొదటి సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

దెందులూరు: దెందులూరు మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరగనున్నాయి. దెందులూరు నియోజకవర్గంలోని 309 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆయా మండలాల్లోని ఎంఈఓలకు ఈ మేరకు విద్యాశాఖ రాష్ట్ర స్టేట్ ప్రాజెక్టు ఆఫీసర్ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు.

పెదపాడు మండలంలో...

పెదపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులచే కమిటీలు ఏర్పాటు కానున్నట్లు చెప్పారు.

60 మంది విద్యార్థుల ఎంపిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో విశాఖపట్నంకు చెందిన దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రంటీస్ ఉద్యోగాల కోసం ఈ డ్రైవ్ నిర్వహించారు. 60 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశామని దివీస్ ల్యాబొరేటరీస్ హెచ్‌ఆర్ ప్రతినిధి ఏ. రాజేష్ తెలిపారు.

మెడికల్ షాపుల తనిఖీ

టి.నరసాపురం: అనుమతులు లేకుండా ఔషధాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం, తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు జి.జీవని, మల్లికార్జునరావు అన్నారు. టి.నరసాపురంలో బుధవారం మెడికల్ షాపులను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్యాధికారులకు వచ్చిన ఫిర్యాదుల మేరకు మండలంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టి.నరసాపురంలోని 6 మెడికల్ షాపులను తనిఖీ చేశామని, బిల్లుల్లో చిన్న తేడాలు తప్ప మరే తేడాలు లేవన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష



పాతూరులో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నూర్జహాన్

దెందులూరు: తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. బుధవారం దెందులూరు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలన్నారు. దెందులూరు నర్సింగ్ కళాశాల విద్యార్థినులు బుధవారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

భీమడోలు: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని భీమడోలు సూపర్‌వైజర్ నూర్జహాన్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలో పాతూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, పోష్టికాహారం, బాల్య వివాహలు, నూతన చట్టాలపై, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటిపై కిశోర్ బాలికలకు అవగాహన కల్పించారు. నూర్జహాన్ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు పట్టడం ద్వారా తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు పుట్టిన గంటలోపే ముర్రిపాలు పట్టించాలని, తద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి అందుతుందన్నారు. ఆధునిక సమాజంలోని స్త్రీలు తమ బిడ్డకు పాలు పట్టేందుకు అయిష్టత చూపుతూ డబ్బా పాలు అలవాటు చేస్తున్నారన్నారు. తద్వారా అన్ని విధాలుగా తల్లీ, బిడ్డకు నష్టం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, టీచర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.